తెదేపా సభ్యత్వ నమోదు 26 నుంచి



రంపచోడవరం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని **ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి** నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 26న రాజవొమ్మంగి మండలం కిండ్ర గ్రామంలో ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, దీనికి మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ప్రతిఒక్కరూ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. ఏ రోజు ఏ గ్రామంలో సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించేది అందరికీ తెలియజేస్తామన్నారు. దీంతోపాటు రంపచోడవరం క్యాంపు కార్యాలయంలో ప్రతిరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.అయిదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.


ఉద్యోగుల క్రీడాపోటీలు 29 నుంచి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల ప్రకారం.. జిల్లాలో ఉన్న ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్‌మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తలారిసింగి క్రీడా మైదానంలో ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లాస్థాయి పోటీలు జరగనున్నాయని చెప్పారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, వాలీబాల్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఖో-ఖో పోటీలు పురుషులు, మహిళల విభాగాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీన స్విమ్మింగ్ పోటీలు అనకాపల్లిలో జరుగుతాయన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకూ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పోటీలకు హాజరయ్యే ఉద్యోగులు గుర్తింపుకార్డుతో పాటు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని వివరించారు.

ఉత్తమ విద్యకు ఊతం

-పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించే ఉత్తమ పాఠశాలల (బీఏఎస్)కు మంచి రోజులు రానున్నాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఈ పథకాన్ని నిలిపేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో బీఏఎస్‌లను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నిర్వాహకులకు బకాయిలు చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి నివేదికలు సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పేర్కొన్నారు.



★ త్వరలో బీఏఎస్‌ల పునఃప్రారంభం
★ బకాయిల చెల్లింపు దిశగా చర్యలు

ఉన్నతస్థానాలకు ఎదిగిన వైనం

నిరుపేద, ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్న గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి చదువు అతి దూరం కాకూడదని గతంలో తెదేపా ప్రభుత్వం బీఏఎస్‌లను తీసుకొచ్చింది. ఏటా ఎనిమిది వేల మంది విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో ప్రవేశం కల్పించేవారు. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.30 వేల వరకూ చెల్లించేవారు. పాడేరు డివిజన్‌లోని అరకులోయలో అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్‌తోపాటు సెయింటాన్స్, పాడేరు సెయింటాన్స్, బీవీకే, పెదబయలు, గూడెంకొత్తవీధి మండలం ఆర్వీనగర్ పాఠశాలలు బీఏఎస్‌లుగా ఉండేవి. నర్సీపట్నం, విశాఖ పట్టణ పరిధిలో మరికొన్ని పాఠశాలల్లో పిల్లలకు బోధన జరిగేది. ఇందులో చదువుతున్న విద్యార్థులు ఉన్నతస్థానాలకు వెళ్లారు. డాక్టర్లు, ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. గిరిజన ప్రాంతంలో బీఏఎస్‌లకు గుర్తింపు ఉండేది. 2019 ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం ఈ పాఠశాలలను రద్దు చేసింది. ఇందులో చదువుతున్న విద్యార్థులను సమీపంలోని పాఠశాలలకు తరలించారు. అప్పట్లో తల్లిదండ్రులు దీన్ని ఎంత వ్యతిరేకించినా ప్రభుత్వం స్పందించలేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం బీఏఎస్‌లను ప్రారంభిస్తామని ప్రకటించడంతో ఆదివాసీలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పదికోట్లు పెండింగ్ పెట్టిన వైకాపా సర్కారు

ఈ పాఠశాలలను ఎత్తివేసిన గత ప్రభుత్వం నిర్వాహకులకు బకాయిలు కూడా చెల్లించలేదు. సుమారు రూ.10 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా ఉపయోగం లేకపోయింది. కూటమి ప్రభుత్వం నిర్వాహకులకు వీటిని చెల్లించేందుకు కసరత్తు చేస్తోంది. బీఏఎస్‌లను రద్దు చేసే సమయానికి ఎంత మంది పిల్లలున్నారు, వారికి చెల్లించాల్సిన బకాయిలపై నివేదిక కోరుతున్నారు. ఈ నెలాఖరు నాటికి వారి ఖాతాల్లో సొమ్ములు జమ చేయనున్నారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ డీడీ రజనిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. బీఏఎస్‌లకు చెల్లించాల్సిన బకాయిలపై వివరాలు సేకరిస్తున్నామన్నారు. నిర్వాహకుల నుంచి వ్యక్తిగత డిక్లరేషన్ తీసుకున్న తర్వాత వారికి చెల్లింపులు జరుపుతామని వివరించారు.

గురువులకు గుడ్లు.. పిల్లలకు పాట్లు

ఆశ్రమ పాఠశాలలో మెనూ అమలు తీరిది

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో భోజన మెనూ అటకెక్కుతోంది. సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు కావడం లేదు. దీంతో గిరిజన విద్యార్థులు రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. సొవ్వా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులకు బంగాళదుంప కూరతో పాటు నీళ్లను తలపించిన సాంబారుతో సిబ్బంది సరిపెట్టారు. ఉపాధ్యాయులకు మాత్రం ప్రత్యేకంగా కోడిగుడ్ల కూర వడ్డించడం గమనార్హం. ఈ పాఠశాలలో 131 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా.. గురువారం 80 మంది ఉన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడంపై ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావును వివరణ కోరగా.. విద్యార్థులకు పెట్టిందే ఉపాధ్యాయులు కూడా తినాల్సిందేనని తెలిపారు. ప్రత్యేకంగా వారి కోసం వండించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులకు షోకాజ్ నోటీసు ఇస్తామని చెప్పారు.



విద్యార్థులకు పెట్టిన బంగాళదుంప కూర, నీళ్ల సాంబారు



ఉపాధ్యాయులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన గుడ్డు కూర

చింతపల్లిలో 17 డిగ్రీల ఉష్ణోగ్రత

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయని స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ శాఖ నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. బుధవారం 16.5, గురువారం 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. చలిగాలులు వీస్తున్నాయన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు గూడెంకొత్తవీధి కస్తూర్బా గాంధీ విద్యార్థిని ఎంపికైనట్లు ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గొల్లోరి తులసి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న పోటీల్లో అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గురువారం విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థిని తులసిని అభినందిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

అనకాపల్లి డీఈవోగా పదోన్నతి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిగా జి.అప్పారావునాయుడిని పదోన్నతిపై నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ ఏడీగా ఉన్నారు. ఇంతవరకు అనకాపల్లి జిల్లా డీఈవోగా ఉన్న ఎం.వెంకటలక్ష్మమ్మను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు.

సంక్రాంతిలోగా గుంతల్లేని రోడ్లు

ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు 20 కోట్లు కేటాయింపు

అల్లూరి జిల్లాలో కొత్త రహదారులకు రూ. 1800 కోట్లతో ప్రణాళిక

జడ్పీ సర్వసభ్య సమావేశంలో హోంమంత్రి అనిత



వేదికపై మంత్రి అనిత, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు

ఈనాడు, విశాఖపట్నం, అనకాపల్లి: అల్లూరి జిల్లాలో దశలవారీగా డోలీ మోతల్లేకుండా చేయడానికి రూ.1800 కోట్లతో రహదారుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన ఉమ్మడి జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. అనిత మాట్లాడుతూ సంక్రాంతిలోగా రూ.20 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని రోడ్లపై గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పల్లె పండగ పేరుతో 25 జిల్లాల్లో రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేస్తుంటే అల్లూరి జిల్లాకు పైసా కూడా కేటాయించకపోవడం ఘోరమని అక్కడి జడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కలెక్టర్ దినేష్‌కుమార్, మంత్రి అనిత సమాధానమిస్తూ ఏజెన్సీలో 1350 పైగా గ్రామాలకు ఇప్పటికీ రహదారి సదుపాయం లేదని, వాటన్నింటికీ రోడ్లు వేయడానికి రూ.1800 కోట్ల వరకు అవుతుందన్నారు. ఈ మేరకు ఉపాధిహామీ నిధులతో పాటు ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి ఇక్కడ పరిస్థితిని వివరించి అదనపు నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. గంజాయి సాగు నివారణకు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అందరి సూచనలు, సలహాలతో జిల్లా సమగ్రాభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

జల్‌జీవన్ పనుల్లో జాప్యమెందుకు?: గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా వదిలేశారని, రోడ్లను తవ్వేసి వదిలేయడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయంటూ పలువురు సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై మండిపడ్డారు. 'మీరు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ప్రభుత్వం మాటలు కాయాల్సి వస్తోంద'ని మంత్రి అనిత సైతం అసహనం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నియోజకవర్గంలోని పలు శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించి వాటిని త్వరితగతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు.

చట్రాయిపల్లి గ్రామాన్ని తరలిస్తాం..: ఇటీవల వర్షాలతో గూడెంకొత్తవీధి మండలంలో పలు గ్రామాలు బాగా దెబ్బతిన్నాయని, అధికారులు అరకొర పరిహారంతో సరిపెట్టేశారని జడ్పీటీసీ సభ్యులు శివరత్నం, దీసరి గంగరాజు, బాలయ్యపడాల్ ఆరోపించారు. దీనికి స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ పోడు వ్యవసాయం వల్ల కొండలు కరిగిపోయి గ్రామాల మీదకు వస్తున్నాయని చెప్పారు. కొండచరియలు పడిన చట్రాయిపల్లి గ్రామాన్ని సప్పర్ల సమీపానికి తరలిస్తామని, 37 కుటుంబాలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని వివరించారు.



హాజరైన ప్రజాప్రతినిధులు

విశాఖ ఉక్కుపై మా వైఖరి స్పష్టం..: విశాఖ ఉక్కు కర్మాగారం విషయమై పార్లమెంటులో ప్రస్తావించాలని ఓ సభ్యుడు **ఎంపీ శ్రీభరత్‌**ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్టీల్ ప్లాంటు విషయంలో కేంద్రం నుంచి సానుకూల పరిణామాలు చోటుసుకున్నాయని గుర్తుచేశారు. ప్లాంటు అవసరాల దృష్ట్యా రెండు దఫాలుగా రూ.1700 కోట్లు విడుదలయ్యాయని వెల్లడించారు. దీన్నిబట్టే ఉక్కు కర్మాగారం విషయంలో తమ వైఖరి ఏంటో స్పష్టంగా తెలుస్తోందన్నారు.



నరేగాను వ్యవసాయానికి అనుసంధానం చేయాలి..

'ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయించాలి. కాఫీ తోటల పెంపకానికి నరేగా ద్వారా సహకారం అందేలా చూడాలని, ఈ మేరకు పార్లమెంటులో ఈ సమస్య గురించి ప్రస్తావించాల'ని ఎంపీలు తనుజారాణి, శ్రీభరత్‌లను ఛైర్‌పర్సన్‌తో పాటు పలువురు జడ్పీటీసీ సభ్యులు కోరారు. ఏజెన్సీలో సరఫరా చేసిన రాజ్‌మా విత్తనాల్లో చాలావరకు నాసిరకంగా ఉంటున్నాయని, నాణ్యత లేని విత్తనాలను ఎందుకు ఇస్తున్నారని జడ్పీ ఛైర్‌పర్సన్ వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. బడుల్లో ఉపాధ్యాయుల కొరత గురించి భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు ప్రశ్నించారు. పాఠశాలల్లో పిల్లలతో పనులు చేయిస్తున్నారని, మధ్యాహ్న భోజన పథకం సరకులు దారిమళ్లుతున్నాయని మునగపాక జడ్పీటీసీ సభ్యుడు సోమసత్యనారాయణ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ కలెక్టర్లు విజయకృష్ణన్, హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జడ్పీ సీఈవో నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక సిబ్బంది



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి రవాణా మార్గాలు, మూలాలను పరిశీలించి, దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఎన్‌డీపీసీఎల్ సెల్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టామని పేర్కొన్నారు. చెక్‌పోస్టులను బలోపేతం చేస్తామని, కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కేసుల ప్రధాన పాత్రధారులను సాంకేతిక సాయంతో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడ్డవారిపై పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, ప్రజలకు వివరించేలా ప్రచార కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో బియ్యం అక్రమ నిల్వలు



మాట్లాడుతున్న డీడీ విజయశాంతి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలోని ఒక గదిలో అక్రమంగా బియ్యం బస్తాలు నిల్వ ఉంచినట్లు గుర్తించామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయశాంతి తెలిపారు. ఎంపీపీ జి.వెంకటలక్ష్మి గురువారం ఉదయం ఈ గురుకుల కళాశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ గదిలో అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన విషయం గుర్తించారు. ఈ విషయంపై ఆమె ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. దీంతో సాయంత్రం ఈ ఘటనపై డీడీ విచారణ చేపట్టారు. డీడీ వచ్చేటప్పటికే ఎంపీపీ వెంకటలక్ష్మి, రెవెన్యూ అధికారులు కళాశాలలోనే ఉన్నారు. ఎంపీపీ సమాచారం మేరకు బియ్యం బస్తాలు నిల్వ ఉంచిన గదిని తెరిపించినట్లు డీడీ తెలిపారు. ఆ గదిలో 30 బస్తాలు ఉన్నాయని, మరో నాలుగు బస్తాలు బయట ఉన్నాయన్నారు. బయట ఉన్న బస్తాలను అప్పటికే విద్యార్థినులతో తరలించే ప్రయత్నం చేశారని తెలిసిందన్నారు. దీనిపై విద్యార్థినులను విచారణ చేయగా ప్రిన్సిపల్ చేయించారని చెప్పారని డీడీ పేర్కొన్నారు. విచారణ అనంతరం విలేకరులతో డీడీ మాట్లాడుతూ పీఓ ఆదేశాలతో కళాశాలలో విచారణ చేపట్టామన్నారు. ఘటనపై ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థినులను ఆరాతీశామన్నారు. విచారణలో తానే ఈ బియ్యాన్ని వేరే గదిలో నిల్వచేశానని, ఎవరి ప్రమేయం లేదని ప్రిన్సిపల్ తెలిపారని డీడీ అన్నారు. తమ విచారణలో దాదాపు 1700 కిలోల బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. బియ్యం, పది కేజీల చింతపండు సీజ్‌చేసి అడ్డతీగల ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామన్నారు. విచారణ నివేదికను పీవోకు అందజేస్తామన్నారు. ఎంఈఓలు సత్యనారాయణదొర, సూరయ్యరెడ్డి, సీఆర్పీ శ్రీనివాస్, ఆర్ఐ చెల్లాయ్యమ్మ, వీఆర్వో సూర్యకాంతం ఉన్నారు.

రబ్బరు రైతులకు నరేగా ప్రోత్సాహం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలో రబ్బరు తోటల సాగును ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి, దాని ద్వారా ఈ పంట సాగుచేసే రైతులకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం వెల్లడించారు. వేటుకూరు పంచాయతీ పరిధిలోని పందిరిమామిడికోట (పీఎంకోట)లో గురువారం రబ్బరు రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రబ్బరు తోటల సాగుకు మారేడుమిల్లి, వై.రామవరం మండలాలు అనుకూలమన్నారు. సాగుతోపాటు, రబ్బరు షీట్లు తయారీ, మార్కెటింగు విభాగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన రైతులకు నైపుణ్యాభివృద్ధికి తగిన శిక్షణ ఇస్తామన్నారు. రబ్బరు మొక్కలు నాటిన దగ్గర నుంచి వాటిని సంరక్షించుకునే పనులను ఉపాధి హామీ పథకంలో చేర్చి, డబ్బులు ఇస్తామని వివరించారు. అనంతరం రబ్బరు పాలతో షీట్లు తయారు చేసే ప్రాసెసింగు యూనిట్‌ను ఆయన పరిశీలించారు. హార్టికల్చర్ అధికారి చిట్టిబాబు, నాయకులు గొర్లె అనిల్‌ప్రసాద్, పల్లాల రాజ్‌కుమార్ రెడ్డి, రేవుల జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలినడకే శరణ్యం.. ఏదీ కనికరం!



భీమవరం ఆరోగ్య కేంద్రానికి నడిచి వెళ్తున్న విద్యార్థులు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

అనారోగ్యానికి గురైన గిరిజన విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరం నడిచి ఆసుపత్రికి వెళ్తున్నారు. అనంతగిరి మండలం గుమ్మకోట గురుకుల పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ విద్యార్థులు జ్వరాలబారిన పడితే ఏఎన్ఎం కాలినడకన వారిని భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాఠశాల నుంచి జ్వరాలతో ఉన్న నలుగురు, చర్మవ్యాధులతో ఉన్న ముగ్గురు, నరాల బలహీనతతో ఉన్న ఒక విద్యార్థి సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ ఆసుపత్రికి వచ్చారు. దీనిపై ప్రిన్సిపల్ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఏటీడబ్ల్యూవో వెంకటరమణను వివరణ కోరగా.. పాఠశాలకు వెళ్లి పరిశీలిస్తామన్నారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.



నరాలు పట్టేసినా..: రెండు రోజుల నుంచి నరాలు పట్టేసి నడవలేకపోతున్నాను. అయినా కాలినడకన ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం బడికి నడిచే వెళ్లాను.

– గోవర్ధన్, ఆరో తరగతి

పేదల సంక్షేమమే లక్ష్యం

అరకులోయ, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. అరకులోయలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో కనీసం తాగునీటికి నోచుకోని పరిస్థితి ఉండేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. నాయకులు సుబ్బారావు, సాయిరాం, అమ్మన్న, పాండురంగస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

డీఆర్వోగా పద్మలత

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు అయ్యాయి. గత పది నెలల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా సేవలు దిస్తున్న కె.మోహన్ కుమార్ చిత్తూరు డీఆర్వోగా బదిలీ అయ్యారు. విశాఖ డీఆర్వోగా బీహెచ్. భవానీశంకర్‌ను నియమించారు. నగరంలో సివిల్ డిస్పెన్స్ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.పద్మలతను అల్లూరి సీతారామ రాజు డీఆర్వోగా నియమించారు. ఆమె స్థానంలో ఎవర్నీ నియమించలేదు.

నిండా పూడిక.. నీటికి చోటేదిక!

తాండవ, రైవాడల్లో తగ్గిన నిల్వ సామర్థ్యం

వర్షపు నీటిని ఒడిసిపట్టి వ్యవసాయానికి వినియోగించుకునేందుకు వీలుగా నిర్మించిన జలాశయాల్లో ఏటా పూడికలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించలేకపోతున్నాయి. ఇటీవల కేంద్ర జలసంఘం పూడిక ముప్పున్న జలాశయాల జాబితాను ప్రకటించింది. అందులో అనకాపల్లి జిల్లాకు చెందిన తాండవ, రైవాడ రిజర్వాయర్లున్నాయి. నీటి నిర్వహణ సమయంలో ఉన్న నిల్వ సామర్థ్యానికి, ఇప్పటి పరిస్థితికి వ్యత్యాసం ఎక్కువగానే ఉంది.

వాస్తవ నీటినిల్వ సామర్థ్యం: **3.59 (టీఎంసీలు)**
ప్రస్తుత సామర్థ్యం: **3.12 (టీఎంసీలు)**

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, అనకాపల్లి

జిల్లాలో తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ, కల్యాణపులోవ జలాశయాలున్నాయి. ఈ ఐదు రిజర్వాయర్ల కింద 1.03 లక్షల ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. వర్షాభావ పరిస్థితులు, జలాశయాల నిర్వహణ లోపాల కారణంగా ఎప్పుడూ పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగు నీరందించలేకపోతున్నారు. ఈ రిజర్వాయర్ల క్యాచ్‌మెంట్ ఏరియా అంతా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం. అక్కడ కురిసిన వర్షాలతో నీరంతా వాగులు, వంకల ద్వారా జలాశయాల్లోకి వచ్చి చేరుతుంది. ఏజెన్సీలో కొంతకాలంగా పోడు వ్యవసాయం ఎక్కువగా చేస్తున్నారు. కొండలు, గుట్టల్లో చెట్లను కొట్టి, మట్టిని తవ్వి సాగు చేస్తున్నారు. దీంతో వర్షాల సమయంలో ఆ ఎర్రమట్టి అంతా నీటితో పాటు వచ్చి రిజర్వాయర్లలోకి వస్తోంది. అలాగే జలాశయాల ఎగువన మైనింగ్ కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆ వ్యర్థాలన్నీ వర్షపు నీటితో కొట్టుకొచ్చి రిజర్వాయర్లలోకి చేరుతున్నాయి. వీటి మూలంగా పూడికలు ఏటా పెరిగిపోతున్నాయి. కేంద్ర జల సంఘం తాండవ, రైవాడ జలాశయాల గురించి మాత్రమే నివేదించినా మిగతా రిజర్వాయర్ల పరిస్థితీ అలానే ఉంది.

పూడికలు ఎంత మేర పేరుకుపోయింది సర్వేలు చేస్తున్నారు కానీ వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. పూడికల విషయమై నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్తులో జలాశయాలు ఒట్టిపోయే ప్రమాదం ఉందని సాగునీటి రంగం నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రైవాడను డ్రిప్ పథకంలో చేర్చినా..

అనంతగిరి కొండల్లో కురిసిన వర్షం నీరంతా రైవాడ జలాశయానికి వచ్చిచేరుతుంది. ఆయా కొండల్లో మట్టి, ఎగువన మైనింగ్ వ్యర్థాలన్నీ రిజర్వాయర్‌లోకి రావడంతో పూడికలు పెరిగి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. గత 41 ఏళ్లలో 0.47 టీఎంసీల నీటినిల్వ తగ్గడంతో ఆ మేరకు ఆయకట్టుకు సాగునీరందించలేకపోతున్నారు. ఈ జలాశయం కింద 15,344 ఎకరాలు సాగవుతున్నాయి. విశాఖ నగరానికి రోజూ 50 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. నిర్వహణ లోపాలతో పాటు పూడికల ప్రభావం సాగునీటి సరఫరాపై పడుతోంది. ఈ జలాశయం ఆధునికీకరణ డ్రిప్ పథకంలో చేర్చినా కార్య రూపంలోకి తీసుకురాలేకపోయారు.



తాండవలో ఏటా తగ్గుముఖం..

వాస్తవ నీటినిల్వ సామర్థ్యం: **4.96 (టీఎంసీలు)**
ప్రస్తుత సామర్థ్యం : **4.49 (టీఎంసీలు)**

తాండవ జలాశయం కింద అనకాపల్లి, కాకినాడ జిల్లాలో పరిధిలో 51,465 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ఈ జలాశయానికి ఎగువ నుంచి వచ్చే ప్రవాహం (ఇన్‌ఫ్లో) గత పదేళ్లలో ఎప్పుడూ పూర్తిస్థాయిలో రాలేదు. అరకొర సాగునీటితోనే ఆయకట్టుకు నీరందిస్తున్నారు. గతేడాది వర్షాభావంతో సగం విస్తీర్ణానికి కూడా నీరందించలేక వారబందీ విధానం అమలు చేయాల్సి వచ్చింది. ఎగువ నుంచి వచ్చే నీరు తగ్గిపోవడంతో పాటు జలాశయంలో పూడికలు పెరగడంతో నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో ఈ రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతున్న అరకొర నీరు కూడా నిలిచే అవకాశం లేక వృథాగా వదిలేయాల్సి వస్తోంది. దీనికి తోడు గత సర్కారు జలాశయాల నిర్వహణను గాలికి వదిలేసింది. గేట్లకు రంధ్రాలు పడినా పూడ్చలేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాకనే ఈ గేట్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారు.



నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తుకు ముప్పు

ప్రభుత్వాలు చెరువులు, కాలువల్లో పూడికలు తీయిస్తున్నాయి. జలాశయాల జోలికిపోవడం లేదు. వేసవిలో నీరు తక్కువగా ఉంటుంది. ప్రతి ఆయకట్టుకూ ఒకసారి పూడికలు తీయించాలి. ఇందుకు ప్రత్యేకంగా యంత్రాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి తీయించొచ్చు. పూడికలు తీయకుండా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో జలాశయాల్లో సగం కూడా నీరు నిల్వ ఉండే అవకాశం ఉండదు.

– ఎస్.కోటేశ్వరరావు, నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్, అనకాపల్లి

ధరల పెరుగుదలతో ప్రజల ఇబ్బందులు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలులో ఈ నెల 29న జరగబోయే సీపీఎం మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. పెదబయలులోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆరోపించారు. జీవో నం మూడు రద్దుతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. నాయకులు బొండా సన్నిబాబు, శరభన్న, సాగిని ధర్మన్నపడాల్, బోనంగి చిన్నయ్య, బుజ్జిబాబు, బొండా గంగాధరం తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సురేంద్ర తదితరులు

పాడేరు, న్యూస్‌టుడే: డిసెంబరు 2 నుంచి 5 వరకు జరిగే సీపీఎం జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్సయ్య పిలుపునిచ్చారు. గురువారం మోదపల్లిలో పార్టీ పాడేరు మండల మహాసభ నిర్వహించారు. అప్పలనర్సయ్య మాట్లాడుతూ.. ఇసుక, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకుడిగా కె.సురేంద్ర వ్యవహరించారు. పి.లక్కు, ఎస్. చిట్టిబాబు, సత్యనారాయణ, కాంతమ్మ, ఎల్ సుందరరావు, సోమెలి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సు శబ్దం విని అడవిలోకి..

◆ పారిపోయిన గర్భిణి ◆ వైద్య సిబ్బంది చొరవతో సుఖ ప్రసవం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రింతాడ పంచాయతీ గుర్రాలగొంది గ్రామానికి చెందిన వంతల శ్రావణి గర్భిణి. బుధవారం ఉదయం ఈమెకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. జీకేవీధి పీహెచ్‌సీ ఆరోగ్య సహాయకుడు సత్యనారాయణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, సచివాలయం ఏఎన్ఎం కుమారి ఆ గ్రామానికి వెళ్లారు. అదే సమయంలో 108 రావడంతో ఆ శబ్దం విన్న గర్భిణి గ్రామానికి సమీపంలోని అడవిలోకి పరుగులు తీసింది. వైద్య సిబ్బంది ఊరంతా తిరిగి ఇంటింటికి వెళ్లి చూసినా కనిపించలేదు. చేనులోకి వెళ్లగా వారిని చూసి దాక్కుంది. చేసేదేమీ లేక వైద్య సిబ్బంది వెనుదిరిగారు. గురువారం ఉదయం వైద్యసిబ్బందితో పాటు పీహెచ్ఎన్ ద్వారకామయి అంబులెన్స్‌లో గ్రామానికి వెళ్లగా.. గర్భిణి ఇంటివద్ద ఉంది. సిబ్బంది ఆమెకు అవగాహన కల్పించడంతో ఆసుపత్రికి వచ్చేందుకు ఒప్పుకొంది. గూడెంకొత్తవీధి ఆసుపత్రికి తీసుకు రావడంతో వైద్యులు అచ్యుత్, వినయ్ పరీక్షించి సుఖప్రసవం చేశారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

పాయకరావుపేట: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగికి చెందిన నక్కా రామకృష్ణ బుధవారం రాత్రి నక్కపల్లి వైపు నుంచి తుని వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. నామవరం వద్ద వెనుక నుంచి వచ్చిన ఆయనను లారీ వేగంగా వచ్చి ఢీకొంది. బలమైన గాయం కావడంతో రామకృష్ణ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పురుషోత్తం చెప్పారు.

ఉపాధ్యాయులు లేక సాగని బోధన

సీలేరు, న్యూస్‌టుడే: దుప్పిలవాడ పంచాయతీ కొమ్ములవాడ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు అన్నారు. గురువారం పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ సుమారు 38 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. అధికారులు నేటికీ ఉపాధ్యాయులను నియమించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.



కొమ్ములవాడ పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ఆదివాసీ గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

ఎటపాక, న్యూస్‌టుడే: కుసుమానపల్లిలోని కృపా గాస్పెల్ చర్చి మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ ఉయికా పీటర్ సింగయ్య, సేవకుల ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, ఎటపాక మండలాల్లోని వలస ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ కుటుంబాలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వలస ఆదివాసీలకు, కొండరెడ్డి కుటుంబాలకు సుమారు 500 దుప్పట్లు, 2000 చీరలు, ఇతర దుస్తులు, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో నాలుగు రోజులు అన్నదాన కార్యక్రమాలు కూడా చేపట్టినట్లు పాస్టర్ సింగయ్య తెలిపారు. పాస్టర్లు ప్రభు, దివ్య కుమార్, గాబ్రియేల్, జాన్‌పాల్, జాన్ తరుణ్, మోహన్, బ్రదర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

డోలీమోతలు నివారించాలని ధర్నా

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామ రాజు జిల్లాలో డోలీమోతలు నివారించాలని పలువురు గిరిజనులు గురువారం జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పీవీటీజీ గిరిజన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి, విద్యుత్తు సదుపాయం కల్పించాలన్నారు. కొయ్యూరు మండల పరిధి మూలపేట, రోలుగుంట మండల పరిధి పొత్వగెడ్డ, నీలిబంద, కవ్వకుంట మీదుగా రహదారి ఏర్పాటుకు ఉపాధి నిధులు రూ.కోటి విడుదల చేశారని, పనులు మాత్రం పూర్తి కాలేదని వాపోయారు. అనంతగిరి మండల పరిధిలోనూ ఇటువంటి పరిస్థితులే ఉన్నాయని వాపోయారు. జడ్పీ సాధారణ సమావేశంలో తమ సమస్యలపై చర్చించి పరిష్కారం కనుగొనాలని కోరారు. సంఘం నాయకులు కె.వెంకటరావు, చిన్నారావు, కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గిరిజనులు మంత్రి అనితను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజా పోరాటాల్లో సత్యనారాయణది కీలకపాత్ర

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కారానికి నిర్వహించే అన్ని కార్యక్రమాలను పూనెం సత్యనారాయణ ముందుండి నడిపించేవారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని రేఖపల్లికి చెందిన సీపీఎం సీనియర్ నేత సత్యనారాయణ గుండెపోటుతో మృతిచెందారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆయన సంస్మరణ సభను గురువారం రేఖపల్లిలో నిర్వహించారు. ఈ సంస్మరణ సభలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్యనారాయణ (54) మృతి పార్టీకి, కుటుంబానికి తీరనిలోటన్నారు. 40 ఏళ్ల నుంచి పార్టీలో చురుకుగా పనిచేస్తున్న నాయకుడన్నారు. పేదల అభివృద్ధికి ఆయన ఆశయాలను నేతలంతా ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. అంతిమయాత్రలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పలువురు నాయకులు పాల్గొన్నారు. చింతూరు అడిషనల్ డీఎంహెచ్‌వో పుల్లయ్య, ఎంపీపీ కారం లక్ష్మి, తెదేపా, ఇతర పార్టీల నాయకులు నివాళులు అర్పించారు.



సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం రాష్ట్రనాయకులు

రహదారుల నిర్మాణానికి చర్యలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలోని పలు వీధుల్లో సిమెంట్ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి దురియా పుష్పలత తెలిపారు. గురువారం డైరీ నగర్ వీధిలో సుమారు రూ.6 లక్షల పంచాయతీ నిధులతో సిమెంట్ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు దారలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ఎటపాక, న్యూస్‌టుడే: క్రిష్ణవరంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురి కావడంతో విద్యుత్తు సరఫరాలేక గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక తెదేపా నాయకులు బొల్లా పుల్లయ్య, దానే రాజు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో ఆమె స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.. అధికారులు గురువారం క్రిష్ణవరంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే నవంబర్ 1 నుంచి సమ్మెకు సిద్ధమని సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి అప్పురంగి బుజ్జిబాబు తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ నేతృత్వంలో గురువారం ఆర్వీనగర్ ఏపీఎఫ్‌డీసీ కార్యాలయం ఎదుట కాఫీ కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. రాజారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకం

ఎటపాక, న్యూస్‌టుడే: ఆరోగ్య పరిరక్షణలో క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దేవ్‌నాగ్ అన్నారు. మండలంలోని గౌరీదేవిపేట పీహెచ్‌సీలో గురువారం ఆశా కార్యకర్తల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నీ ఆరోగ్య ఉప కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశాలు 0-5 ఏళ్లలోపు పిల్లలకు తప్పని సరిగా టీకాలు వేయించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పిల్లలు ఆరోగ్యానికి ప్రమాదమన్నారు. ప్రతీరోజు గ్రామంలోని ప్రజల ఆరోగ్య సమాచారం తెలుసుకోవాలని, తద్వారా గుర్తించిన రోగులను పీహెచ్‌సీలకు తరలించాలన్నారు. గర్భిణులు, బాలింతలను ఎప్పటికప్పుడు వైద్య పరీక్షల నిమిత్తం పీహెచ్‌సీలకు తీసుకురావాలన్నారు. హెల్త్ విజిటర్ (హెచ్‌వీ) వాణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న వైద్యాధికారి దేవ్‌నాగ్

రామాలయానికి మైక్‌సెట్ల వితరణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: బొర్నగూడెంలో నూతనంగా నిర్మించిన కోదండ సీతారాముల ఆలయానికి దానధర్మ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి తోట రామకృష్ణ రెండు మైక్ సెట్లతోపాటు పూజా సామగ్రి అందజేసినట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ ప్రముఖ్ నల్లమిల్లి వెంకటరామరెడ్డి తెలిపారు. ఆలయ ప్రారంభంతోపాటు ఈ నెల 28న విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న సందర్భంగా గురువారం ధార్మిక సంస్థ వనవాసీ కల్యాణ్ ఆశ్రమం ప్రతినిధి బొగ్గుల కాటంరెడ్డి అధ్యక్షతన స్థానికులు సమావేశమయ్యారు. ఆలయ ప్రారంభానికి భక్తులంతా హాజరు కావాలని కోరారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అడబాల రమణ, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో అన్న సమారాధన

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెంలోని లక్ష్మీగణపతి దేవాలయం వద్ద గురువారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక, దుర్గమ్మ నవరాత్రులు, నిమజ్జన కార్యక్రమాలు విజయవంతంగా ముగించుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, ప్రసాదం స్వీకరించారు.

గంజాయి రవాణా ముఠా అరెస్టు

మోతుగూడెం, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న ముఠాను మోతుగూడెం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై శివన్నారాయణ కథనం ప్రకారం.. మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం పసుపులంక గ్రామం నుంచి విజయవాడ తరలిస్తున్న రూ.10 వేల విలువైన రెండు కిలోల గంజాయి పట్టుబడింది. విజయవాడ పంజా కూడలికి చెందిన షేక్ రిజ్వాన్, కేఎల్‌రావు నగర్‌కు చెందిన కూరగంటి సుభాష్‌లను అరెస్టు చేసి రంపచోడవరం కోర్టుకు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: గంజాయితో దొరికిన ఏడుగురు నిందితుల వివరాలను ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఏసీపీ వై. ప్రసాదరావు మీడియాకు వివరించారు. గురువారం ఉదయం తిరువూరు రోడ్డులోని ఓ ప్లాట్‌లో పోలీసులు దాడి చేయగా.. అక్కడి షెడ్డులో గంజాయితో ఏడుగురు చిక్కారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, ఏజెన్సీ ప్రాంతంలోని కిముడు శంకర్ అనే గంజాయి విక్రేతకు అప్పగించి.. అతడి నుంచి గంజాయి తెచ్చి మైలవరం ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు వెల్లడించారన్నారు. దొరికిన వారిలో ఇద్దరు మైనర్లు, స్థానిక పెద హరిజనవాడకు చెందిన వేల్పుల జమలయ్య(జార్జి), అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి ప్రాంతానికి చెందిన గంజాయి విక్రేత కిముడు శంకర్, ఎ.కొండూరు మండలం గొల్లమందలకు చెందిన వీరమళ్ల ప్రేమ్‌కుమార్, దాసుళ్లపాలేనికి చెందిన వింజమూరి సంపత్, దేవునిచెరువుకు చెందిన కేశి సాగర్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



నిందితులతో మోతుగూడెం పోలీసులు

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

వై.రామవరం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ బి.దివాకర్ రావు తెలిపారు. దేవరమడుగుల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	107
లైవ్	137	127
డ్రెస్డ్	199	224
స్కిన్‌లెస్	226	234

భూముల మ్యుటేషన్ గిరిజనుల హక్కు



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ, చిత్రంలో సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మావతి

పాడేరు, న్యూస్‌టుడే: మన్యంలోని భూముల మ్యుటేషన్లు గిరిజనుల హక్కని, నిర్దిష్టమైన గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ ఆదేశించారు. గురువారం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో పాడేరు డివిజన్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మ్యుటేషన్లకు రైతుల నుంచి నోటరీ అఫిడవిట్లు తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నోటరీ అడుగుతున్నారని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మ్యుటేషన్ చేయడానికి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే తక్షణమే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ల లాగిన్లో 275, వి.ఆర్.ఓ లాగిన్‌లో 84 మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. లబ్ధిదారులకు సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. రేషన్ బియ్యం ఎక్కడైనా పక్కదారి పడితే సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్ఓ బి. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు ఎంపీడీవోగా చైతన్య


ఎంపీడీవోకు స్వాగతం పలుకుతున్న కార్యదర్శులు

చింతూరు, న్యూస్‌టుడే: చింతూరు ఎంపీడీవోగా చైతన్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రవిబాబు కృష్ణా జిల్లా తిరువూరుకు బదిలీ కాగా, కోనసీమ జిల్లా ఐ పోలవరం నుంచి ఈయనను చింతూరు ఎంపీడీవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. చింతూరు, మోతుగూడెం కార్యదర్శులు ప్రసాద్, మోహన్, సిబ్బంది మర్యాద పూర్వకంగా ఆయనను కలిసారు.

ఇంటింటికీ తపాలా సేవల విస్తరణ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: తపాలాశాఖలో అమలు చేస్తున్న పొదుపు పథకాలను ఇంటింటికీ విస్తరించాలని, ప్రతి ఇంటా పొదుపు ఖాతా ఉండేలా కృషి చేయాలని అరకు సబ్ డివిజన్ తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకిషోర్ అన్నారు. గురువారం ఆయన ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని బ్రాంచి పోస్టాఫీసుల జీడీఎస్ ఉద్యోగులతో పెదబయలు ఉపతపాలా కార్యాలయంలో సమావేశమయ్యారు. పీఎస్‌బీ, ఆర్‌డీ, టీడీ, తపాలాబీమా, గ్రామీణా తపాలాబీమా, మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధియోజన పథకాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. ఎంఓ శ్రీను, ఎస్పీఎం బప్పికుమార్, జీడీఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన

గంగవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో జాతీయ పశుగణన కార్యక్రమం శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు నెల్లిపూడి జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక అప్పన్నబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన సిబ్బంది ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి వస్తారని పాడి రైతులు, గ్రామాల్లో ప్రజలు ఈ సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

బాధలు పట్టవు.. బాగు చేయరు!

కల్వర్టులు కుంగి రవాణా భారం


సుజనపేట మార్గంలో కూలిపోయిన కల్వర్టు, రోడ్డు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

మన్యంలో అధిక వర్షాలు, వరదల బీభత్సానికి కొట్టుకుపోయిన, కూలిన కల్వర్టులు, వంతెనలకు మరమ్మతులు చేపట్టక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మైళ్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. కల్వర్టులు పాడై నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ముంచంగిపుట్టు మండలంలోని సుజనపేట గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న పైపు కల్వర్టు కూలిపోయింది. రోడ్డు కోతకు గురైంది. ఇది జరిగి మూడు నెలలు కావస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. సుజనపేట మార్గంలో రవాణా సేవలు నిలిచిపోయాయి. సుజనపేట, కుమ్మరిపుట్టు సహా మరో 14 గ్రామాల ప్రజలు మత్స్యగెడ్డపై నాటుపడవను ఆశ్రయించి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా పడవపై ప్రయాణం చేస్తున్నారు. కూలిన కల్వర్టు వద్ద వంతెన నిర్మాణం చేపట్టి, పాడేరు నుంచి సుజనపేట వరకు బస్సు సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు ఎదురుచూపు

బుంగాపుట్టు పంచాయతీలో అధిక వర్షాలకు మూడు కల్వర్టులు కూలిపోయాయి. బుంగాపుట్టు మార్గంలో గర్రం గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు కొట్టుకుపోయింది. చుట్టుగొంది గ్రామానికి వెళ్లే మార్గంలో మరో రెండు కల్వర్టులు కుంగిపోయాయి. బుంగాపుట్టు గ్రామ సమీపంలో మరో వంతెన కూలిపోయింది. చాన్నాళ్ల క్రితమే ఇవి పాడైనా మరమ్మతులు చేయించలేదని పంచాయతీలోని 18 గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 కి.మీ.ల దూరం కాలినడకన వెళ్తేనే వైద్యం, నిత్యావసర సరకులు అందుతున్నాయని వాపోతున్నారు. బూసీపుట్టు పంచాయతీలోని డి.కంఠవరం వెళ్లే రహదారి వర్షాలకు ఛిద్రమైంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారులు, వంతెనలు, కల్వర్టులకు మరమ్మతులు చేయించి రవాణా సేవలు మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.


గర్రం గ్రామ సమీపంలో..

అవీ ఇవీ

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కొర్రాయి పంచాయతీ జాకరగుడలోని ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మోటారుకు అనుసంధానంగా ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ విడి భాగాలను అపహరించుకుపోయారు. దీనిపై సర్పంచి కొముల సంబంధిత అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు.

గుంతలో పడిన పశువులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: చింతలపూడి పంచాయతీ బబ్బూరి కూడలిలో సెల్ టవర్ కేబుల్ కోసం తీసిన గుంతలో రెండు పశువులు పడిపోయాయి. వీటిని బయటకు తీయడానికి గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. గుంతలను పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టాలు మంజూరు చేయరూ..

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న తమకు పట్టాలు మంజూరు చేయాలని జెర్రెల పంచాయతీ కప్పుమేడ, సక్కమెట్ల, పోతురాజుగున్నల గ్రామాలకు చెందిన గిరిజనులు కోరుతున్నారు. గురువారం ఉప సర్పంచి నాగేశ్వరరావు, జనసేన నాయకులు బచ్చల బొజ్జన్నదొర మాట్లాడుతూ.. మూడు గ్రామాలకు చెందిన సుమారు 70 గిరిజన కుటుంబాలు గత కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. వీరందరికీ ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గిరిరైతులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ కేంద్రం ఏర్పాటు చేయాలి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: గ్యాస్ వినియోగదారుల ఈ-కేవైసీ నమోదుకు జి.మాడుగులలో కేంద్రం ఏర్పాటు చేయాలని బొయితిలి మాజీ సర్పంచి కిడారి భీంబాబు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ-కేవైసీ నమోదుకు మహిళలు పాడేరు ఐటీడీఏ గ్యాస్ గోదాముకు వెళ్లాల్సి వస్తోందని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ఉచిత గ్యాస్‌పై మహిళల హర్షం

హుకుంపేట, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించనుండటంతో గిరి గ్రామాల్లో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని జనసేన మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు పేర్కొన్నారు. పాతుకోటలో గురువారం గిరి మహిళలతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని చెప్పారు.

కొమ్మల తొలగింపు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: లంబసింగి ఘాట్ రోడ్డులో విద్యుత్తు నిర్వహణ పనుల్లో భాగంగా తీగలకు సమీపంలోని చెట్లకొమ్మలను తొలగించామని విద్యుత్తు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు గురువారం తెలిపారు. సిబ్బంది పాండురాజు, లోవరాజుబాబు, నారాయణమూర్తి, మూర్తి పాల్గొన్నారు.

జనరల్ సర్జన్‌ను నియమించాలని వినతి

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభావతిని గురువారం ఉదయం కూటమి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జనరల్ సర్జన్‌ను నియమించాలని, జనరేటర్ ఏర్పాటు చేయాలని కోరారు. 108 అంబులెన్స్ ఒక్కటే ఉండటం వల్ల అత్యవసర సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సూపరింటెండెంట్ తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యం


మాట్లాడుతున్న డీఈవో, ఎంఈవోలు, ఏఎంవో

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. స్థానిక తలారిసింగి ఆశ్రమోన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 22వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల ఆసక్తిని గుర్తించి, వారికి అనువైన విధానంలో బోధన చేయాల్సి ఉంటుందన్నారు. ఏఎంవో భాస్కరరావు, ఎంఈవో-1 విశ్వప్రసాద్, ఎంఈవో-2 సరస్వతిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

గంగవరం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు, వినియోగదారులకు మేలు చేకూరుతుందని వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని మర్రిపాలెంలో గురువారం ఏవో విశ్వనాథ్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది రాజు, అనిల్, ఉష, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అసంపూర్తి రహదారితో అవస్థలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గోకవరం నుంచి పాతకోట నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు గురువారం తిరుగు ప్రయాణంలో దుంపవలస కూడలి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రహదారి అంచులు దిగడంతో మట్టిలో కూరుకుపోయి, నిలిచిపోయింది. బస్సు సిబ్బంది, ప్రయాణికులు, స్థానికుల సాయంతో అతికష్టంపై తోసుకుంటూ బస్సును బయటకు తీశారు. అనంతరం యథావిధిగా ప్రయాణికులతో బస్సు వెళ్లిపోయింది. ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయకపోవడంతో పాటు, తరచూ వర్షాలు కురుస్తుండటంతో ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


దుంపవలస వద్ద మట్టిలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

తుప్పల్లో సూచిక బోర్డు


పెదబయలులో ఇలా..

పెదబయలులో విద్యుత్తు ఉపకేంద్రం కార్యాలయ సూచిక బోర్డు కొద్దిరోజులుగా తుప్పల్లో దర్శనమిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యవేక్షణ కోసం వచ్చే అధికారులు, విద్యుత్తు సమస్యలు, బిల్లుల చెల్లింపు కోసం వచ్చే వినియోగదారులకు సమాచారం కోసం ఈ బోర్డు ఏర్పాటుచేశారు. ఇది ప్రస్తుతం తుప్పల్లో నేలకొరిగి ఉంది. అధికారులు స్పందించి తక్షణమే ఈ బోర్డును యథావిధిగా ఏర్పాటుచేసి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

మహిళా సంఘాల బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీడీవో, ఏపీఎం తదితరులు

గంగవరం, న్యూస్‌టుడే: మహిళా సంఘాల బలోపేతానికి కృషిచేసి వారంతా ఆర్థికంగా అభివృద్ధిచెందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం షణ్ముకేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మహిళా సంఘాలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలపై మాట్లాడారు. సంఘాలను గ్రేడింగ్ చేసి మరిన్ని రుణాలు అందించనున్నట్లు తెలిపారు. ఈవోపీఆర్డీ నర్సింహరావు, స్త్రీనిధి మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఎస్బీఐ బ్రాంచి మేనేజర్ జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలతో వయోజన విద్య

మహిళా సంఘాల సభ్యులతో గ్రామాల్లో వయోజన విద్య అదించేందుకు కృషి చేస్తామని ఏపీఎం ఎ. షణ్ముకేశ్వరరావు తెలిపారు. సుమారు 400 మందికి వయోజన విద్య అదించేందుకు 40 మంది వాలంటీర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

అవాంఛనీయ ఘటనలపై అప్రమత్తం

వై. రామవరం, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఇన్‌ఛార్జి ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఆర్పీఎఫ్ క్యాంపులో రక్షణ తదితర అంశాలపై ఆరా తీశారు. సమస్యలుంటే తెలియజేయాలన్నారు. సీఐ నరసింహమూర్తి, వై. రామవరం ఎస్ఐ బి. రామకృష్ణ, సీఆర్ఎఫ్ అధికారులు, జవాన్లు, సిబ్బంది ఉన్నారు.


వై. రామవరం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

రంపచోడవరం, న్యూస్‌టుడే: దీపావళి సామగ్రిని విక్రయించేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కల్పశ్రీ పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు, అగ్నిమాపక అధికారులతో సబ్‌కలెక్టర్ కల్పశ్రీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి సామగ్రిని విక్రయించేవారంతా గ్రామానికి శివారులోని ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపారులంతా విధిగా తహసీల్దార్ల వద్ద అనుమతులు పొందాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ప్రమాదాలకు తావులేకుండా వ్యాపారులంతా తగు జాగ్రత్తలను పాటించాలన్నారు. డీఎల్‌పీవో రాఘవన్, తహసీల్దార్లు సత్యనారాయణ, సూర్యారావు, బాలాజీ, రామకృష్ణ, సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీవోలు శ్రీనివాసరావు, విశ్వనాథ్, బాపన్నదొర, సీఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

పాపికొండల యాత్ర పునఃప్రారంభానికి ఏర్పాట్లు


పోశమ్మగండి బోటు పాయింట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఏఈ భాస్కర్

దేవీపట్నం, న్యూస్‌టుడే: పాపికొండల విహారయాత్రకు త్వరలో అనుమతులు ఇవ్వనున్న నేపథ్యంలో గండిపోశమ్మ ఆలయం వద్ద బోటు పాయింట్‌ను జలవనరుల శాఖ ఏఈ భాస్కర్ పరిశీలించారు. బోటు సిబ్బందితో మాట్లాడారు. గోదావరిలో వరద పరిస్థితిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గోదావరిలో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 26.8 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోందన్నారు. అధికారులు అనుమతులు మంజూరు చేస్తే 13 బోట్లు పాపికొండల విహారయాత్రకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అవగాహన సదస్సు నేడు

రంపచోడవరం, న్యూస్‌టుడే: దేవీపట్నం మండలం పి.గొందూరులో శుక్రవారం ఉదయం 10గంటలకు గోదావరిలో బోటింగ్ కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి బోటింగ్ నిర్వహణలో ఎటువంటి భద్రత చర్యలు తీసుకోవాలి... ఆకస్మికంగా ప్రమాదం సంభవిస్తే ఏవిధంగా రక్షించాలి.. ఎటువంటి చర్యలు చేపట్టాలి..తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఎస్డీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్ నిర్వహిస్తుందని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. బోట్ల యజమానులు, రెవెన్యూ, పోలీసు, అటవీ, అగ్నిమాపక, ఇరిగేషన్, మత్స్య, వైద్యశాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి మండల సమస్యలు

ఎటపాక, న్యూస్‌టుడే: మండల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కలిసి విన్నవించినట్లు ఆరకు పార్లమెంట్ కార్యదర్శి ముvvా శ్రీను తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో గురువారం ఈ మేరకు మంత్రికి మండల సమస్యలపై వినతిపత్రం అందజేశామన్నారు. విలీన మండలాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పాఠశాల భవనాలు లేక విద్యార్థులు పడే కష్టాలు, గోదావరి వరదల్లో బాధితుల కష్టాలు, పోలవరం పరిహారం చెల్లింపులో గందరగోళం, ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు ఉన్న రోడ్డుపై గుంతలు పూడ్చాలని మంత్రిని కోరామన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎటపాక సర్పంచి కారం వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గోడేటి రవికుమార్, రైతు నాయకులు ముvvా రాంప్రసాద్, ముత్తయ్య, రాంబాబు, ముఖేష్ ఉన్నారు.


అమరావతిలో మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న ఎటపాక తెదేపా నాయకులు

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

అరకులోయ/ పట్టణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల్లో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని అరకులోయ ఎక్సైజ్ సీఐ సంతోష్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అరకులోయ సర్కిల్ పరిధిలో 6 దుకాణాలు ఏర్పాటయ్యాయన్నారు. డుంబ్రిగుడ మండలంలో ఒకటి, అనంతగిరిలో ఒకటి, అరకులోయ మండలంలో నాలుగు ఏర్పాటు చేశారన్నారు. ఎంఆర్‌పీ ధరలకు మాత్రమే విక్రయాలు జరపాలని చెప్పారు. గొలుసు దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా విక్రయాలపైనా దృష్టి సారించామని పేర్కొన్నారు. గంజాయి రవాణా, సాగుపై ఉక్కుపాదం మోపామన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని గూడెంకొత్తవీధి ఎస్సై అప్పలసూరి తెలిపారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఆయన గురువారం పరిశీలించారు. 18 ఏళ్లలోపు వారికి మద్యం ఇవ్వవద్దని సూచించారు.

దహన ఖర్చులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక అటవీ చెక్‌పోస్టు నివాసం ఉంటున్న వృద్ధురాలు మణి గురువారం మృతి చెందింది. ఈమె అంత్యక్రియలకు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రూ. అయిదు వేల ఆర్థిక సాయం చేశారు. రంపచోడవరం నాయి బ్రహ్మణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి ఈమె పరిస్థితి వివరించడంతో ఆర్థిక సాయాన్ని అందజేశారు. తెదేపా నాయకులు సలాది బాపిరాజు, పెంటపాటి అనంతమోహన్ చేతులమీదుగా ఈ మొత్తాన్ని వారికి అందజేశారు.

చదువుతోనే అభివృద్ధి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, సమాజం అభివృద్ధి చెందుతుందని అరకు సీఐ హిమగిరి అన్నారు. కిల్లోగుడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో గురువారం సమావేశమయ్యారు. పాఠశాల స్థాయిలో చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. బాగా చదివి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఖైనీ, గుట్కా, గంజాయి జోలికి వెళ్లొద్దని సూచించారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


కిల్లోగుడలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

పాఠశాలల్లో తనిఖీలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని ఎంఈవో-2 సూరయ్యరెడ్డి అన్నారు. లబ్బర్తి ఎంపీయూపీ, మొల్లిమెట్ల ఎంపీపీ పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చిన్నారులతో మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల కట్టడాల సర్వేలో జరిగిన లోపాలను సవరించి, అందరికీ న్యాయం జరిగేలా చూడాలని పోలవరం ప్రత్యేక కలెక్టర్ సరళ వందనకి తెలుగు యువత ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నరేశ్ విజ్ఞప్తి చేశారు. చింతూరు ఐటీడీఏకి గురువారం వచ్చిన ఆమెను కలిసి, స్థానిక ముంపు గ్రామాల ప్రజల ఇబ్బందులు, సర్వేల్లో తప్పులు వివరించారు. గతంలో సర్వేల్లో ఇంజినీరింగ్ ఉద్యోగులు లేకుండా కేవలం వాలంటీర్లతో చేయడం వలన కట్టడాల విలువల్లో తప్పులు వచ్చాయన్నారు. ఆమెకు వినతిపత్రం అందించారు. సిద్ధు, కిరణ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.


ప్రత్యేక కలెక్టర్‌కి వినతిపత్రం అందిస్తున్న నరేశ్ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: కొత్తగాంధీనగరం నుంచి రంపచోడవరం వచ్చే ప్రధాన రహదారిలో తుప్పలు పెరగడంతో మార్గ సూచికలు కనిపించడం లేదు. దీంతో కొత్తగా వచ్చేవారు ఏ గ్రామం ఎక్కడ ఉందో తెలుసుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు.
– కె.రామకృష్ణ, రంపచోడవరం.

✓: ఇటీవల వర్షాలు కారణంగా ప్రధాన రహదారుల్లో తుప్పలు పెరిగిపోయాయి. వీటిని తొలగించేందుకు చర్యలు చేపడతాం.
– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, రంపచోడవరం.



మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

?: మారేడుమిల్లి నుంచి పుల్లంగి వెళ్లే ప్రధాన రహదారిలో మారేడుమిల్లి శివారులో ఉన్న పెద్ద చెట్టు ఎండిపోయి రహదారిపైకి వాలిపోయి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు – రాము, మారేడుమిల్లి

✓: ప్రమాదకరంగా ఉన్న ఈ ఎండిన చెట్టును తొలగించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. – విజయ్‌కుమార్, ఈవోపీఆర్డీ, మారేడుమిల్లి

ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పోలవరం ముంపు మండలాల్లో, ఉప తహసీల్దారు సుబ్బారావు సేవలు ప్రసంశనీయమని జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ఏఎస్‌డీఎస్ డైరెక్టర్ గాంధీబాబు అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయన్ను గురువారం సత్కరించారు. తెదేపా మండలాధ్యక్షులు ఆచంట శ్రీను, ప్రకాశ్‌రావు, రాజు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి ఎస్సైగా అరుణ్‌కిరణ్ అందించిన సేవలు ఎనలేనివని వర్తక సంఘం మండల కార్యదర్శి పెదిరెడ్ల బేతాలుడు అన్నారు. బదిలీపై వెళుతున్న ఎస్సైను గురువారం సన్మానించి జ్ఞాపికను అందజేశారు. దూనబోయిన రమణ పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: బూదరాళ్ల పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ఇటీవల గొలుగొండ మండలానికి బదిలీ అయిన కె.శ్రీనివాసరావును సర్పంచి ముత్యాలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కుమారి సత్కరించారు. పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ సూరిబాబు, సంజీవ్, మల్లేష్, తేజ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సదుపాయం

మోతుగూడెం: బొడ్డగండి పంచాయతీ రెడ్డినగర్, మెట్టగూడ గ్రామాల్లో సత్యసాయి సేవా సంస్థ గ్రావిటీ ద్వారా తాగునీటి సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. ఆ గ్రామస్థులతో సంస్థ ప్రతినిధులు గురువారం సమావేశాలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ., సంస్థ సభ్యులు మావూరి శ్రీనివాసరావు, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం సహించం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించమని ఎంపీడీవో ఏ.వి.వి.కుమార్ హెచ్చరించారు. గురువారం సిబ్బందితో కలిసి కొండిబ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో బయోమెట్రిక్ వేయాలని పేర్కొన్నారు. జాబ్ ఛార్టు ప్రకారం విధులు నిర్వహించాలని చెప్పారు. సచివాలయ పరిధిలోని తాగునీటి బావిని పరిశీలించారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కొండిబాలో బావి పరిశీలిస్తున్న ఎంపీడీవో

తెదేపా బలోపేతమే లక్ష్యం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర పిలుపునిచ్చారు. స్థానిక కిడారి సామాజిక భవనంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు ఆధ్వర్యాన గురువారం పార్టీ మండల సమావేశం జరిగింది. ఈనెల 26 నుంచి జరిగే సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలన్నారు. పార్టీ అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ ఎంపీపీ దన్నేరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, నేతలు సుబ్బారావు పాల్గొన్నారు.


డుంబ్రిగుడలో మాట్లాడుతున్న దొన్నుదొర

రంపచోడవరం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత నమోదును ఈ నెల 26 నుంచి 30వరకు రాజవొమ్మంగి మండలంలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. 31నుంచి నవంబరు 6వరకు అడ్డతీగల, 7నుంచి 10వ తేదీ వరకు వై.రామవరం, 11నుంచి 14వరకు గంగవరం, 15నుంచి 18 వరకు దేవీపట్నం, 19నుంచి 23వరకు రంపచోడవరం, 24నుంచి 26వరకు మారేడుమిల్లి మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.